# సెండాఫ్

"ఈ మహాసభలో ప్రఖ్యాత రచయిత ప్రదీప్‌గారిని పరిచయం చెయ్యడానికి ఎంతో ఆనందిస్తున్నాను. కళాపరిషత్తువారు నిర్వహించిన పోటీలలో ప్రథమ బహుమతి గెల్చుకోటమే ఆయన ప్రజ్ఞకు తార్కాణం. ఈ సందర్భంలో ప్రప్రథమంగా ఆయన్ని అభినందించే అవకాశం మన కళాశాల సారస్వతసంఘానికే లభించడం నిజంగా గర్వకారణం. భారత ప్రభుత్వం త్వరలోనే వీరిని అమెరికా పంపుతోంది. ఆరు నెలలపాటు అక్కడి అంధ విద్యా ప్రణాళిక పరిశీలించి వస్తారు. తాను స్వయంగా అంధుడైనప్పటికీ తన రచనలతో ఎందరికో వెలుగు నియ్యగల శక్తిని భగవంతుడు ఆయనకు ప్రసాదించాడు..."

అధ్యక్షుడు అదేపనిగా పరిచయవాక్యాలు పలుకుతూ పోతున్నాడు, ప్రదీప్ అంధుడని అప్పటిదాకా తెలియనివాళ్ళు, "ఇంత బాగా రచనలు చేయగల ఈయన అంధుడా!" అంటూ విస్తుపోయారు. తెలిసిన వాళ్ళు, "పాపం! దృష్టి ఉంటే ఎంత బాగుండేదో!" అని జాలి పడ్డారు.

ఆశ్చర్యపోయిన వాళ్ళల్లో లతాదేవి కూడా ఉంది. సభలో ఒక ప్రక్కగా కూర్చుని శ్రద్ధగా వింటున్న ఆమె మనస్సులో పలురకాల భావనలు ఉరకలు వేస్తున్నాయి.

"ఇన్ని అభ్యుదయ భావాలుగల ఈ నవయువకుడు అంధుడేమిటి? ఇన్నాళ్ళూ నేను చదివి ఆనందిస్తున్న రచనలన్నీ...? నా అభిమాన రచయిత గ్రుడ్డివాడని ఎన్నడూ అనుకోలేదే..." ఆలోచిస్తున్న కొద్దీ అభిమానానికి ఆర్ద్రత తోడై ఆ హృదయంలో వెల్లువలై పారుతోంది. ఆ నల్లటి కళ్ళద్దాలవైపు అలాగే నిశ్చలంగా చూస్తూ కూర్చుంది.

క్రమంగా హాలంతా ఖాళీ అయింది.

చేతి బెత్తంతో తడువుకుంటూ, అంతా చూస్తూన్నట్లే ద్వారం వైపు అడుగులు వేస్తున్నాడు ప్రదీప్. ఒకరిద్దరు సాగనంపడానికి మాట్లాడుతూ అతనితో నడుస్తున్నారు.

"నమస్కారమండీ." ఆదరం పొంగిపొర్లే కంఠం వినిపించింది.

అనుకోని అభివాదం- అందులోనూ స్త్రీ స్వరం! అతని అడుగులు ఆగిపోయినాయి. ఆవైపు తిరిగి ప్రతినమస్కారం చేశాడు ప్రదీప్ "ఎవరండీ?" అన్నట్లుగా.

"నాపేరు లత. ఈ కాలేజీలోనే బి.ఇడి. చదువుతున్నానండీ. నాకు మీ రచనలు- ముఖ్యంగా మీ గేయాలు... ఎంతో యిష్టం, పరిచయం చేసుకోవాలనే అభిలాషతో మీదారికి అడ్డువచ్చాను. మన్నించాలి."

అతని వదనం ఆనంద తరంగితమైంది "చాలా కృతజ్ఞుణ్ని. అదంతా మీ అభిమానం..."

"చీకటి జీవితాలు" నాకు బాగా నచ్చిన గేయమండీ! ఎంత యథార్థంగా చిత్రించారో, అడుగడుగునా కరుణరసం చిందించారు... కష్టకల

వాళ్ళెందరో- ఈ దేశంలో చీకటి జీవితాల్లో తడువుకునే వాళ్ళు- కళ్ళకు కట్టేలా వర్ణించారు:"

బాగా చెప్పారండీ... బహుశ నాదీ చీకటి జీవితమేకనుక కొంచెం ఆవేదనతో చెప్పగలిగానేమో! ఇంతకూ మీరూ రచయిత్రి అయి ఉంటారు"

ఆమె కొంచెం సిగ్గిలుతూ అంది "రచయిత్రినేం కాదండీ! నాలుగైదు కథలేవో పత్రికల్లో వచ్చాయి. అంతే."

"ఆ విద్యుల్లత అనే పేరుతో వచ్చిన కథలు మీవేకదూ!"

ఆమె మాట్లాడలేదు.

"చాలా సంతోషమండీ!... మిమ్మల్ని చూడలేకపోయాననిబాధగా ఉంది. మీ అభిమానం ఎప్పటికీ నిలుపుకుంటానని ఆకాంక్షిస్తాను ... తొలి యత్నాలైనా మీ కథల్లో మంచి శిల్పం ఉంది. రాణింపుకు వచ్చే రచనా శక్తి ఉన్న కలంమీది. ఆపకండి."

"మీ ప్రోత్సాహానికి చాలా ధన్యవాదాలు."

"మీతో పరిచయం నాకూ ఎంతో సంతోషకరంగా ఉంది. మళ్ళీ ఎప్పుడైనా కలుసుకుందాం మరి... సెలవు"

"నమస్తే!"

మంచి పొడగరి, తెల్లని రంగు, చూడగానే అందగాడనిపించే వర్చస్సు, చదువూ, ఉద్యోగం .. అన్నింటినీ మించి మంచి రచయితగా పేరు తెచ్చుకున్నాడు ...ప్రదీప్‌కి ఈ అంధత్వమేమిటో...ఇన్ని ఉన్నా అతడు ప్రపంచాన్ని చూడలేడుగదా?... తననికూడా!

ఆలోచిస్తున్న లలితాదేవి ముఖంమీద ఆవేదన ఆవరించింది, అప్రయత్నంగానే ఆమెపాదాలు పబ్లిక్‌గార్డెన్ వైపు అడుగులు వేస్తున్నాయి.

తనకు అతని రచనలంటే ఎంతభిమానం! మున్నటి పరిచయంతో ఆదరం కూడా ఏర్పడింది— ఆదరమా, ఆరాధనమా? ఎవరైనా అందగా వుంటే, అతనిసాధన ఇంకెంతగా రాణించి ఉండేదో!—

పూల మొక్కలుదాటి నడుస్తూ, కూచోడానికి తగిన చోటు చూసుకుంటున్న లత హఠాత్తుగా ఆగింది.

''ప్రదీప్'' తానీమాట బిగ్గరగా అన్నట్టు ఆమెకే తెలియదు.

ప్రదీప్ తలయెత్తి ఆస్వరం వైపు తిరిగిఅన్నాడు ''లలితాదేవిగారా''

ఆమె ఆశ్చర్యపోయింది. 'అవునండీ నమస్కారం నన్ను చూశారా?'

"చెప్పానుగా! స్వరం, స్పర్శ— ఇవే నాకు రెండు నేత్రాలు".

"నేనింకా మీకు గుర్తుంటానని అనుకోలేదండీ— "

'బహుశః అది మీలో విశేషమేనేమో! నాలుగు మాటల్తోనే అనాడు నాపై చెరగని ముద్రవేశారు. ఇంతకూ ఒకేజాతి వాళ్ళం.... రచనారంగంలో సహచరులం. కనుక పూర్తిగా క్రొత్తవాళ్ళం కాదు."

'మీ ఔదార్యంకాని నేనేం పోలికండీమీతో....' అనబోయింది లత.

మాటకు అడ్డువస్తూ ప్రదీప్ అన్నాడు "అయ్యో! నిలబడే ఉన్నారే అప్పటినుంచీ...'

'ఫరవాలేదండీ,' ఆమె కూర్చుంటూ అంది, 'మీరు రోజు వస్తుంటారా తోటకి?'

ఆమె ముఖంలో ఆ కలతను అతను చూడలేదు. అతని వదనంలో ఆనందం వెన్నెలలా విరిసింది 'అవునండి! అదీనా దినచర్య. మరి మీరు?'

"నేను సాధారణంగా రానండీ. ఇవాళెందుకో మనసు బాగాలేక బయలుదేరాను. ఇల్లు ఇక్కడికి దగ్గరే."

"అలాగా" అన్నాడు ప్రదీప్; ఇంతలో ఏదో గుర్తుకొచ్చినట్టుంది. కాగితం గంటం తీస్తూ అన్నాడు "క్షమించాలి లతాదేవిగారూ! ఒక్క నిమిషం మళ్ళీ మర్చిపోతాను.

'బ్రెయిల్'లో అతనేదో వ్రాస్తూ కూచున్నాడు. కాగితంమీద అతి త్వరితంగా చిల్లులుపడుతూ ముందుకుసాగే ఆ అంధలిపి ఆశ్చర్యంగా చూస్తూ కూచుంది లత.

రెండు నిమిషాల తరువాత మళ్ళీ సంభాషణ ముందుకు సాగింది. రచనలూ, ఔచిత్యాలూ, పాత్రపోషణలూ ఏమేమిటో అతని వాగ్ధాటికీ, జ్ఞానానికీ ముగ్ధురాలైంది లత. ఆమె ఆలోచనాశక్తికీ, విమర్శనాధోరణికి తబ్బిబ్బైపోయాడు ప్రదీప్. వాళ్ళిద్దరి భావాలు సన్నిహితంగా జరిగాయి.

o o o o o

ఆ తోటలోనే అలానే వాళ్ళిద్దరూ అతిసహజంగా కలుసుకుంటుండటం పరిపాటి ఐపోయింది. కాగితాలూ, కలాలూ, వ్రాతలూ రచనలూ... ఇలాంటి వ్యాసంగంలో మునిగిఉండటం నిత్యం తోటకువచ్చే వాళ్ళందరికీ ఒక పరిచితమైన దృశ్యంగా పరిణమించింది.

బ్రెయిల్ లిపిని తడుపుకుంటూ అతను చెపుతుంటే ఎన్నోగేయాలు ఆమెచేతిలో అక్షరబద్ధమాలై పత్రికలకు పంపబడుతుండేవి. లతాదేవి కథలుకూడా అక్కడే పరిష్కరింపబడి రూపుదిద్దుకుంటుండేవి.

చూస్తూచూస్తూ బ్రెయిల్ లిపిలో ఆమెకూడా నిపుణురాలైపోయింది.

○ ○ ○ ○

ఆనాడు లతాదేవి తాజాకథ ఒకటి చర్చలోఉంది. కథ ఇంకా ముగింపుకు రాలేదు. చర్చ దీర్ఘంగా సాగింది.

"అక్షరాలు కనబడ్డంలేదు, వెళదామా ఇక?" అన్నది లతాదేవి.

ఇద్దరూ లేచారు.

"అన్నట్లు మీ ఇల్లెక్కడ? చీకటిపడిపోయిందే! ఒంటరిగా వెళ్ళ గలరా?"... ఆత్రంగా ప్రశ్నించింది లత.

"ఏం ఫర్వాలేదు. ఎప్పుడూ ఎవరుంటారు? అలవాటైపోయింది." ఆ స్వరంలో కొంచెం బాధ వ్యక్తమౌతోంది.

ఆమె ఒక్కక్షణం మౌనం వహించింది: నెమ్మదిగా అంది· 'దిగులు పడకు ప్రదీప్! నీచేతి బెత్తంగా మార్గం చూపించాలనీ, నీకు చూపుగా నిలవాలనీ అనుకునేవాళ్ళు ఈ ప్రపంచంలో లేకపోలేదు."

"ఎవరు?—" అని ఆత్రంగా అడగబోయిందతని మనస్సు, కాని అడగడానికి సాహసించలేదు.

తానేమన్నదో తెలియకుండానే అనేసింది లత. మళ్ళీ మాట్లాడ లేదు.

మరో వారం తరువాత.

"లతాదేవీ! ..రోజూ గార్డెన్‌లో ఇలా కలుసుకోడం ..ముఖ్యంగా మీవాళ్ళకేమైనా..." అతని స్వరం కంపించింది.

ఆమె మాట్లాడలేదు.

"కలుసుకోకుండా. మాట్లాడకుండా ఉండలేక పోతున్నాను. లతాదేవి ఒక్కమాట అడగదల్చుకున్నాను .. బాధపడవు కదా?"

లతాదేవిఎదలో విద్యుత్తు ప్రవహిస్తోంది. అతడేమడుగుతాడు? పెళ్ళి చేసుకోమనేనా?... తనేం చెప్తుంది... గుండెలు వేగంగా కొట్టుకోసాగినై అతడు చూపు గుడ్డి. తను ప్రేమలో గుడ్డి ... చేప్పేందుకేముంది?

'లతాదేవి! నే నేనాడో నిన్ను ప్రేమించాను గుడ్డివాణ్ని ఇలా అనడం ఎబ్బెట్టుగా ఉంటుందేమో కాని నా మనస్సు నిన్ను ఆరాధిస్తోంది, నా చీకటి జీవితంలో వెలుగుబాటగా వెలుస్తావని ఆవేదనతో అర్థిస్తున్నాను లతాదేవీ! తప్పుగా ధ్వనిస్తే ఇప్పుడే చెప్పేయ్... ఇంకెప్పుడూ ఈఊసే ఎత్తను."

ఒక్కొక్కమాట ఆమె గుండెల్లో నాటుకుపోతోంది. ప్రతి పలుకుకూ ఎదలో అమృతపు సోనలు జాలువారుతున్నాయి. వినపడని శృతుల్లో వేయిసార్లు తన ఎదలో అనుకున్న మాటల్లో. అతడిప్పుడు వినపడేలాగా అంటున్నాడు. స్పందిస్తున్న ఆమె చెయ్యి అతని చేతిని నెమ్మదిగా స్పృశించింది,

"లతా!" అతడు ఒక్క క్షణం నిర్ఘాంతపోయాడు. తేరుకుని మళ్ళీ అన్నాడు. "లతా!" అంధుడితో నీకేం సుఖం దొరుకుతుంది? అన్నీ ఆలోచించుకున్నావా?"

"అన్నీ ఏనాడో ఆలోచించుకున్నాను. అందుకే చెయ్యి కలిపాను. ఇంకేమీ ఆలోచించవలసింది లేదు ప్రదీప్. ఒకటే మాట..." ఆమె స్వరంలో దృఢత్వం విని క్షణం ఏమనలేకపోయాడతను.

తరువాత అన్నాడు సందేహంగా, "గుడ్డివాడితో వివాహానికి మరి మీ వాళ్ళు..."

"గుడ్డితనానికి నిర్వచనమేమిటి ప్రదీప్! కళ్ళున్న గుడ్డివాళ్ళు ఎందరు లేరీ లోకంలో. ...మనో సౌందర్యం వీక్షించడానికి కావలసింది అంతర్నేత్రాలు— మళ్ళీ ఈ అంధత్వం ప్రసక్తితేకు ప్రదీప్, నీకు నా కళ్ళున్నాయి. మమత్వం చక్షువుల కతీతమైంది. ఆ అనుభూతిని నేను కూడాకళ్ళతో నిమిత్తం లేకుండానే పొందుతున్నాను ప్రదీప్!"

ఉత్తేజితమైన ఆస్వాదం— స్థిరంగా వెలువడే ఆశబ్దపరంపరా వింటూ ఏలోకంలోనో ఉన్నట్లు కూర్చుండిపోయాడు ప్రదీప్.

× × ×

మరో వారం గడిచింది.

తోటలో అతడు ఆమెకోసం నిరీక్షిస్తూ కూర్చున్నాడు.

"శుభవార్త ప్రదీప్! అమ్మా, నాన్నా ఇద్దర్నీ ఒప్పించాను. నాన్న ఏదో పనిమీద హైదరాబాదు వెళ్తున్నారు. ఒక వారంలో తిరిగిరాగానే

ప్రయత్నాలు చేస్తారట'— ప్రదీప్" ఆమె ఎక్కడా సిలపడంలేదు. హాసా విడిగా వచ్చింది; అనేసింది.

"ఏం ప్రయత్నాలు లతాదేవి"

ఆమె నవ్వుతూ అంది, ఏ లోకంలో ఉన్నావు ప్రదీప్! పెళ్ళి ప్రయత్నాలు!"

"ఆఁ ఒప్పుకున్నారా? ఎలా ఒప్పుకున్నారు? —"

ఆమె నవ్వుతూనే ఉంది.

"లతాదేవి, ఎంత తెగింపు నీది. .మన పెళ్ళిసంగతేనా నువ్వన్నది?"

"ఓహో బాగుంది! ... మన పెళ్ళి ఏమిటి?..."

అతని ముఖం ఒక్కసారి నిస్తేజం అయింది; తబ్బిబ్బైపోయాడు

అటూ ఇటూ చూసి నెమ్మదిగా అంది, 'లతా ప్రదీప్‌ల పెళ్ళి...మన పెళ్ళి అంటే ఎవరికి తెలుస్తుంది.?'

'లతాదేవీ! అదృష్టమంటే నాదే ..' తాపీగా అన్నాడు.

'అబ్బా! ఎంత స్వార్థం? నాది కూడాను.'

'సరే అంతా నీయిష్టం.'

"సరే. అంధత్వానికి ప్రతిదీ అదృష్టమే."

'ప్రదీప్! నీ కవితాధారకు ఆలంబనమై కలకాలం నీ ఊహల్లో కాపురముంటే నాకంతే చాలు.'

కారుమబ్బులు కమ్ముకువస్తున్నాయి. పిల్లగాలులు తోలి హోరుగాలి వీస్తోంది. ప్రదీప్‌ను ఇంటి మలుపుదగ్గర వదిలివేసి లతాదేవి త్వరత్వరగా

ఇంటిదారి పట్టింది. గాలికి దుమ్ము బాగా లేస్తోంది. కళ్ళనిండా మట్టిపడి మెః మెసలాడుతున్నాయి

టపటప రెండు చినుకులు పడినాయో లేదో రోడ్డంతా ఒక్క పెట్టున వాహనాల సద్దడి విజృంభించింది. మోగే గంటలూ, హారన్‌లూ, రిక్షావాళ్ళ అరుపులూ - ఒక్కటే గందరగోళం. ఉన్నట్లుండి దడదడ అందుకుంది వాన. పరుగులాటి అడుగులతో ఆమె ఇంటిసందు సమీపించింది. రోడ్డు దాటుతూన్న లతాదేవికి మలుపుతిరిగివచ్చే కారు హఠాత్తుగా ఎదురైంది.

'కీ'మని మోత. మనిషిపడిన సవ్వడి, అలజడి ... చీకటిలోకి పోతున్న స్పృహ... నేలపై పడిఉన్న స్త్రీ శరీరం.

○ ○ ○ ○ ○

"డాక్టర్ గారూ! ఎట్లా ఉందండీ... ప్రమాదం లేదంటారా?... చెప్పండి డాక్టర్" ప్రాధేయపడే కంఠంలో ఒక్కొక్క మాట పెల్లగించుకు వస్తోంది. ఆత్రం స్వరాన్ని అడ్డగిస్తోంది. కన్నీరుమాత్రం నిరాఘాటంగా వెలువడి వస్తోంది.

ఇరవై రోజుల తర్వాత స్పృహలోనికి వచ్చిన పేషెంటుకు అప్పుడే ఆపరేషన్ చేసి బయటకివస్తున్న డాక్టరు ఒక్కక్షణం ఆగాడు, "ఇప్పుడే ఏమీ చెప్పలేను, ప్రాణానికైతే ఏమీ ప్రమాదం లేదనుకోండి..."

"మరింకేమిటి డాక్టర్! ఎందుకు సందేహిస్తున్నారు చెప్పండి. మీకు దణ్ణం పెడతాను..." రాఘవయ్య పితృహృదయంలో రాయిపడ్డట్లయింది. ఏం కాబోతోంది? ఈ వృద్ధాప్యంలో తన తలపై ఏ పిడుగు పడబోతోంది?

"ఏమీలేదు... వెల్లకిల పడటంలో మెదడు వెనుకభాగంలో ఉండే ఆప్టిక్ నెర్వ్స్ దెబ్బతిన్నై."

"అంటే ఏమిటి డాక్టర్?- ఏమవుతుంది?... చెప్పండి దయచేసి."

"కండ్లు ఆపరేషన్ చేశాను. బహుశః దృష్టి వస్తుందో రాదో?... అంతా మీ అదృష్టం. ఏ విషయం నాలుగోరోజు కట్లువిప్పిన తరువాతగానీ తెలియదు."

నిద్రాహారాలు లేకుండా తల్లి జానకమ్మగారు మంచం ప్రక్కనే కంటికి మంటికి ఏకధారగా పడగాపులు కాస్తోంది. రేపే కట్లు విప్పుతారు. యేం చూడబోతున్నామో! యేం వినబోతున్నామో - ఒక్కగానొక్క సంతానం. బంగారుబొమ్మ బిడ్డ ఏమైపోతుందో?

o o o o o

"అమ్మా నువ్వెక్కడే?... నాన్నా ఏమిటిది? నాకేం కనిపించటం లేదు నాన్నా! నాన్నా!!" ఆమెఅరుపుకి ఆసుపత్రిఅంతా మారు మ్రోగింది. కొంగు నోట్లోకుక్కుకుని వెక్కి వెక్కి ఏడుస్తూ ప్రక్కనే నిలబడిఉంది జానకమ్మ.

రాఘవయ్య కూలబడ్డాడు. డాక్టరు తెల్లబోయాడు.

"అమ్మా!" అన్నాడు తండ్రి కూతురితల రెండుచేతులతో పట్టుకుంటూ.

"నాన్నా? ఏమయింది నాకు?...మీరంతా అదృశ్యమైపోయారేమిటి నాన్నా!" తండ్రిని పెనవేసుకుని వెక్కిళ్ళు పడ్తోంది లత. ఎవరూఓదా

ర్చాలి ఆ కబోదిని? "అమ్మా, నువ్వెక్కడ?— ఎందుకింత దూరం అయి పోయావు? అమ్మా.... అమ్మా నువ్వెక్కడ?" అమ్మ అంగుళం దూరం లోనే ఉంది. కదలడంలేదు.

"నాకిక ఏమీ కనిపించదా? నేను గుడ్డిదాన్నయి పోయానా? వెలుతురే నా కళ్ళకి శాశ్వతంగా దూరమైపోయిందా నాన్నా?"

రెండు రోజులు గడిచాయి. తడువుకుంటున్న లతను చూచి తండ్రి అడిగాడు 'ఏమిటి తల్లి!'

"నాన్నా! ప్రదీప్.... ప్రదీప్ ఎక్కడ?..."

'ప్రదీప్ ఊళ్ళోలేదమ్మా—' విమానం బయలుదేరుతోందని తంతి వచ్చింది. పది రోజుల క్రితమే అమెరికా వెళ్ళిపోయాడు ప్రదీప్. లత క్షేమంగూర్చి అక్కడికి చేరగానే లేఖ వ్రాశాడు, ఇదంతా చెప్పడానికి రాఘవయ్యాగారికి సాహసం చాలలేదు.

ఆరునెలలు దొర్లిపోయినాయి. అప్పుడే వెలుతురు చీకటికి అలవాటు పడుతోంది.

"వచ్చావా, ప్రదీప్! .. ఎక్కడ?,,.. ఇటు నీకోసం క్షణం ఒక యుగంగా చూస్తూ మిగిలిపోయాను ప్రదీప్...ఎన్నాళ్ళయిందో...."అన్నది చేతితో తడువుకుంటూ లత.

చెయ్యి స్పృశిస్తూ అతడు ప్రక్కనే కూర్చున్నాడు. గంభీర మౌన ముద్రలో కొంత సేపు, ఘటనా పరంపర గూర్చిన సంభాషణలో కొంత సేపు ఇట్టే గడిచిపోయింది.

"నీ కళ్ళకు వెలుగు నింపుదామని ఉవ్విళ్ళూరాను, నేనే గ్రుడ్డిదాన్నయిపోయాను. అంతా ఒకటే చీకటి. నాకిక వెలుగు ప్రసాదించే దీపానివి నీవే ప్రదీప్."

ప్రదీప్‌కు తల తిరిగి పోతోంది. ఏమీ పలకలేదు.

రాఘవయ్య అతని చేతులు పట్టుకుని అన్నాడు. "బాబూ! మనసులు కలిసినవాళ్ళు. నా చిట్టితల్లి నీ కోసం ఎంత కలవరించేదో... మీరిద్దరూ ఒకటై బ్రతకాలి. పట్టిన చెయ్యి విడవకు నాయనా!"

ప్రదీప్ మనసులో అంతర్యుద్ధం చెలరేగుతోంది. అమృతభాండంలో విషబిందువొలికింది. వెలుగు చూపుతుందనుకున్న దీపంలో నూనే మిగిలింది ఒత్తిఅంతరించిపోయింది. అయితే పనికిరాని దీపాన్ని వదులుకోవడమేనా? మరి ఇద్దరు గ్రుడ్డివాళ్ళ వివాహం ఎవరికి ప్రయోజనం? నిజమే, కానీ కళ్ళుకలిగిననాడు కావాలని ప్రేమలు ఒలకబోసి, కళ్ళుపోయిన మరుక్షణం రంగంనుండి తప్పుకోవడం పచ్చి ద్రోహంకాదా?... మరి గ్రుడ్డివాడనై మరో గ్రుడ్డిని పట్టుకోనా?... ఈ యాంత్రిక జగత్తులో అంతకన్న అవివేకం ఉంటుందా?... అయితే వెనుకటి ప్రమాణాలన్నీ ఏమైనట్లు?... వాస్తవిక జీవితం వేరు; అది కవితాకల్పనలకంటే భిన్నమైనది ఇంతకూ ఈ దశలో నన్ను కట్టుకుని లతాదేవిమాత్రం యేం సుఖపడుతుంది? అదృష్టం బావుంటే యే కళ్ళుగలవాడో దొరక్కపోతాడా? నేనూ మరెక్కడో ఒక రెండు కళ్లను ఆశ్రయిస్తేనేగదా కనపడని బాటల్లో బ్రతుకు ముందుకు సాగేది! ఆమెకూడా ఇలా ఆలోచించాలంటే తను ప్రస్తుతం ఆమె జీవితమార్గంనుంచి తప్పుకోవలసిందే.

తనకు స్వార్థం గెలిచింది. మనసు ఊరడిల్లింది.

"ఏడవకు తల్లీ! కన్నీళ్ళు కారుస్తూ శూన్యంలోకి చూసే నీ కళ్ళు నేను చూడలేనమ్మా, ఆ గుడ్డితనం నాకు వచ్చినా బాగుండేది.... "అంటూ వాపోయే తండ్రి.

కన్న కడుపు తరుక్కుపోతుంటే కుమిలికుమిలి ఏడ్చేతల్లి, "ఎంత చెప్పినా వినకుండా ఆ గుడ్డివాణ్ణి ఉద్ధరిస్తానంటూ కూర్చుంది. ఛీ! ముందు స్వార్థం పుట్టి తర్వాత మగవాడు పుట్టాడు... నా తల్లి కళకళలాడుతూ ఒక ఇంటిది కావాలని వెయ్యి కళ్ళతో ఎదురు చూశాను. జీవిత సంధ్యా కాలంలో ఈ కడుపుకోత నాకు వ్రాసిపెట్టి ఉంది."

లతాదేవి ఇదంతా నిర్లిప్తంగా వింటూ ఉంటుంది. అప్పుడప్పుడూ అంటుండేది, "ఎందుకే అలా బాధపడ్తావ్? కొన్నాళ్ళు వెలుగు-కొన్నాళ్ళు చీకటి... ప్రకృతి సూత్రమే అంత... అమ్మా! నాకేమీ వేదనలేదు. వ్యథపడుతూ మీ మనసులు పాడుచేసుకోవద్దు. కళ్ళున్నపుడు నేను చూడగల్గింది ఒక్క మనిషి వ్యక్తిత్వం మాత్రమే. ఈ చీకటిలో నాకు మానవత్వమంతా ఒక్కటిగా సాక్షాత్కరిస్తోంది... ఎవరో ఇపుడు వరించి ఏం ప్రయోజనమే అమ్మా! కళ్ళున్న అండకావాలి అతనికి. గుడ్డివాన్ని చేసుకుని ఏంచేస్తాడు?..'

రాఘవయ్యగారికి కోపంవస్తుంది "ఏమిటమ్మా నీ వేదాంతం ఇంకా వాణ్ణి వెనకేసుకొస్తున్నావు? లోకమంతా మీవివాహం అయినట్లే భావించింది. ఇప్పుడెవ్వడు ముందుకు వస్తాడు? ఇంతైనా ఆలోచించని కిరాతకుడు!... గుడ్డివాడైనా ఈ లోకంలో మరో గుడ్డివాన్ని చేసుకోడానికి ఇష్టపడడు. రూపసి విద్యావంతి అని ఎవరైనా ఇష్టపడి ముందుకు వచ్చినా వేలకొలది

డబ్బు సమకూర్చాలి. చాతకాని నిర్భాగ్యుడు నీ తండ్రి ఎక్కడినుంచి తెస్తాడు?... నా తల్లిజీవితం ఏంకాను?" అతని కంఠం రుద్ధమై పోయింది.

వృద్ధాప్యంలో కృంగిపోయే తల్లి తండ్రుల్ని ఆ అంధ యువతి తానే ఓదారుస్తుంటుంది. "మీరిలా దిగులుపడవద్దమ్మా! నాకు ఇదొక్కటే బాధగా ఉంది. లోకం మీరనుకునేంత క్రూరమైంది కాదు నాన్నా! బ్రతుకు సాగకపోదు. అదృష్టవశాత్తు నాకు బి. యస్‌సి. దాకా చదువు చెప్పించారు. బి. ఇడి. కూడా చేశాను. ఎక్కడో పని చేసుకుంటూ తృప్తిగ బ్రతుకుతాను. శేషజీవితం ప్రయోజనకరంగా గడపాలనిఉంది. క్రొత్త మలుపు తిరగాలి నాకింకే ఆశలూ లేవు. నన్నింకా యేదో ఒక ఇంటి దాన్ని చెయ్యాలని యాతనలు పడితే మాత్రం సహించలేను...." ఆమె కంఠం డగ్గుత్తిక చెందింది. కన్నీరుజాలువారింది. రాతిబొమ్మల్లా కూర్చుండి పోయారు, రాఘవయ్య, జానకమ్మ.

శోకించే హృదయాలను కాలపురుషుడు ఓదార్చి పోతుంటాడు. ఎదలో గాయాలు మెల్లమెల్లగా మానుపడుతుంటాయి. ఉండే జ్ఞాపక చిహ్నంగా ఒక మచ్చ మిగిలి పోతుందేమో!

రచనా వ్యాసంగంతో మనసు మరల్చుకుంది లతాదేవి. ప్రదీప్ కోసం నేర్చుకున్న బ్రెయిల్‌లిపి తనకు ఇప్పుడు ఏకమాత్రంగా ఆధారమైపోయింది. బ్రెయిల్‌లిపిలో తన తడువుకుంటూ చెప్తుంటే తీరికవేళల్లో తల్లి జానకమ్మగారు అక్షరలిపిలో వ్రాస్తుండేది. గత పదిరోజులనుంచీ లతాదేవి దీక్షతో పనిచేస్తోంది.

ఒక ప్రముఖ వారపత్రిక ఉగాదికి నవలా రచన పోటీ ప్రకటించారు. గడువు సమీపిస్తోంది, ఆమె నవల "అభాగిని" కూడా ముగింపు కావచ్చింది.

రాఘవయ్యగారు హైద్రాబాదు నుంచి అప్పుడే బండిదిగి వచ్చారు. అలిసిపోయినట్లు కనబడుతున్నా ఇన్నాళ్ళకు ఆయన ముఖంలో ఉత్సాహం తొణికిసలాడుతోంది. కాళ్ళు కడుక్కొని, మంచినీళ్ళు త్రాగి వచ్చి కుర్చీలో కూలబడ్డారు. లతా, జానకమ్మా ఆత్రంతో యేం సమాచారం చెప్తారో అని ఎదురుచూస్తున్నారు.

"తల్లీ! నీకు ఉద్యోగం దొరికినట్లేనమ్మా"

"నాకా? ఎక్కడ నాన్నా— ఇంత తొందరగా!—"

"అదేనమ్మా, వెదకబోయే తీగ కాలికి తగిలినట్లయింది. రామారావు గారనీ మలక్ పేట అంధవిద్యాలయానికి పర్యవేక్షకులుగా వుంటున్నారు. తీరా చూస్తే ఆయన మన వరంగల్ వాడే... ఎప్పుడో చిన్నప్పుడు చూశాను. అన్ని సంగతులు చెప్పాడు. నీ కథ విని ఎంతో వాపోయి, తప్పక సహాయం చేస్తానని మాట ఇచ్చాడు. తనకు సైన్స్ టీచర్ అవసరం ఉందనీ, వెంటనే దరఖాస్తు పెట్టుకోమనీ తగిన సలహాలన్నీ ఇచ్చాడు ... ఎంత మంచివాడో పాపం!" సంతృప్తితో కన్నబిడ్డ తల ఒళ్ళోకి తీసుకుంటూ ముగించాడు రాఘవయ్యగారు.

కాలం పరుగులు తీస్తోంది.

పదిహేను రోజులకల్లా, లతాదేవిని అంధవిద్యాలయంలో అధ్యాపకురాలిగా నియామకం చేస్తూ ఉత్తరువులు అందాయి.

o o o o o

కాకతీయుల ప్రాచీన నగరం- ఆఓరుగల్లులో అణువణువూ ఆమెకు ప్రేమాస్పదమైంది. లత కుటుంబం పుట్టిపెరిగిన ఊరు వదిలి వెళ్ళిపోతోంది.

కళ్ళులేని ప్రాణికి ఆ కాకతీయ శిల్పసౌందర్యంతో యేమిసంబంధం? "ఐనా ఎందుకింత ఆవేదన? పాపం శ్రీరాముడంతటివాడే "జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపి గరీయసి" అని ఆవేదన పడ్డాడంటారు. ఆ ఆవేదన లోని ఆంతర్యం ఇప్పుడర్థమవుతోంది..."

ఇంతలో ప్రక్కింటి వాళ్ళమ్మాయి జయ పరుగెత్తుకుంటూవచ్చింది, "అక్కా, అక్కా! మిఠాయి...మిఠాయి..." లత భుజాలు పట్టుకునిఊపే స్తోంది జయ.

లతకు ఏమిటో అర్థంకాలేదు. "ఏమిటి జయా! మిఠాయి నువ్వె న్నందుకైనా ఇస్తానుగానీ, అసలు సంగతి ఏమిటే?"

ఆ అమ్మాయి నవ్వుతూ అంది, "ఏమిటి?! వెయ్యి రూపాయలు ప్రథమ బహుమతి— ఉగాది నవలా రచన పోటీ— విద్యుల్లతాదేవిగారు గెల్చుకున్నారు—"

"అలాగా! ఏదీ పత్రిక వచ్చిందా?— చదువు— "

"పత్రిక కాదక్కా, టెలిగ్రాం వచ్చింది. రచయిత్రిగారూ! మీఫొటో కావాలట —"

కొంతసేపు ఆ విషాదజీవితాల నిలయంలో ఆనందం పరవళ్ళు తొక్కింది.

గోల్కొండ ఎక్స్ప్రెస్ వేళవుతోంది. వరంగల్ స్టేషన్ చేరాలి.

ఇంకా గంట టైముంది.

ప్రదీప్ వచ్చాడు. బెత్తం టిక్కుటిక్కు మంటుంటే దూరంనించే లతాదేవి గుర్తించింది.

'వచ్చావా ప్రదీప్!'

"లతాదేవీ? పోటీలో ఘనవిజయానికి హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను."

"ఒక్కసారి వీడ్కోలు చెప్పిపోవాలని ఎంతో అనుకున్నాను. ఆ కోరిక నెరవేరింది. సంతోషం. సుఖంగా వుండు ప్రదీప్! నీ ప్రథమ బహుమానంనాడు కలిగిన మన పరిచయానికి నా ప్రథమ బహుమానదినం వీడ్కోలు పలుకుతోంది. శాశ్వతంగా నీ మార్గంలోనుంచి వెళుతున్నాను..."

"లతాదేవీ! మీరంతా వెళ్లిపోతున్నారని హఠాత్తుగా ఈ ఉదయమే విన్నాను. వినగానే ఒక్క క్షణం ఉండలేకపోయాను ... మళ్ళీ ఎప్పుడో కలుసుకోటం?..."

"ఎందుకు ప్రదీప్ కలుసుకోడం? కలుసుకున్న అనుభూతులు చాలు. మనసారా "నా" అనుకున్న ఒక్క క్షణం చాలు మమత ఉన్న హృదయానికి", నిర్లిప్తంగా అంది లతాదేవి.

ప్రదీప్ మాట్లాడలేదు.

"అప్పుడు యేదో వెలుగు ఊహించుకుని ఆనందించాను. ఇప్పుడు లోపలా, బయటా అంతా ఒకటే చీకటి. నిండా మునిగినవాళ్ళకి ఇంకా యేం చలి?"

''నిరాశచెందకు లతాదేవీ!'

"ఈ చీకటి బ్రతుకులో ఆశలంటూ లేనేలేవు, కనుక నిరాశపడే భయమే లేదు ప్రదీప్!"

'నేనేదో ద్రోహం చేశానని ఆవేశపడుతున్నావా లతాదేవీ! నీకు మాత్రం యేంసుఖం చెప్పు— నువ్వు కూడా కళ్ళుగలవాణ్ణి చేసుకుని సుఖపడాలని నా కోరిక."

"ఈ సలహా చెప్పడానికే ఇంత శ్రమపడి వచ్చావా ప్రదీప్! నా గురించి నువ్వేమీ వేదన పడనక్కరలేదు. జీవితమనేది కళ్ళు లేకపోతే చీకటికాదు. అంతరంగాలకు వెలుగు ఆత్మీయతే— నువ్వు ఎన్నో కవితలు వ్రాశావు. కాని కొంచెమైనా అనుభూతి పొందలేదు. విని నేను పొందగల్గాను. ఆ కవితల్లో సత్యం నిత్యమైందని గాఢంగా నమ్మాను... కవిత్వం మద్యపానం లాంటిదికాదు- జీవితానికి వ్యాఖ్యానం. కవితావేశం వాస్తవిక జీవితం ఒకలా నిర్వహించినవాడే నిజమైన కవి— నీవా స్థాయిని ఇకముందైనా ఆర్జిస్తావని ఆశిస్తాను... వేళవుతోంది సెలవు.'

'లతాదేవీ!' యేదో ప్యాకెట్ అందిస్తూ అన్నాడు ప్రదీప్. 'ఇదిగో నా వీడ్కోలు కానుక!...స్వీకరిస్తావా?'

దాన్ని నిరాకరిస్తూ అంది లతాదేవి, 'నీ కానుక- ఎంతో విలువైన కానుక- నాదగ్గరే ఉంది. ప్రదీప్! ఇంకేమీ ఇయ్యనక్కరలేదు.'

'నాదా?— ఎప్పుడిచ్చాను?— యేమిటది?—'

'బ్రెయిల్ లిపి,'

'లతాదేవీ!'

o o o o o

ఒయ్యారంగా ఉరకలు పెడ్తోంది గోల్కొండ ఎక్స్‌ప్రెస్! ఆమె మనస్సు అంటోంది, 'సాక్షీభూతంగా నీ ఔన్నత్యం చూస్తూ నీ ఒడిలో పెరిగాను నీ సౌందర్యం చూడలేని అంధురాలిగా నీకు నమస్కరిస్తున్నాను. ఓరుగల్లుతల్లీ! ... ఎప్పటికీ సెలవు. భావిజీవితం ఎక్కడ గడిచినా, యే పని చేసినా నీ పేరుకు మాత్రం మచ్చరానీయను- ఇవే, నా వీడ్కోలు నమస్సులు.'

(ఆంధ్రజ్యోతి వారపత్రిక 16-11-73)